ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటు వజ్రాయుధం



దొడ్లేరు జెడ్పీపాఠశాలలో ఓటరు నమోదు శిబిరం



గుడిపూడి గ్రామంలో పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి సూచనలు చేస్తున్న తహసీల్దార్ సురేష్



కండ్లకుంటలోని పోలింగ్‌కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ రాజకుమారి పక్కన తహసీల్దార్ నగేష్

సత్తెనపల్లి: ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటే వజ్రాయుధమని సత్తెనపల్లి తహసీల్దార్ ఎస్.సురేష్ అన్నారు. ప్రత్యేక ఓటర్ల నమోదు కేంద్రాలను మండలంలో తహసీల్దార్ సురేష్, పట్టణంలో మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి ఆదివారం ఆకస్మిక తనిఖీలు చేపట్టి బీఎల్వోలకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సురేష్ మాట్లాడుతూ ప్రస్తుతం స్వచ్ఛమైన ఓటర్ జాబితాను రూపొందిస్తున్నామని, ఓటు హక్కు లేని అర్హులందరూ ఓటరుగా నమోదు కావాలన్నారు. అర్హులందరికీ ఓటు హక్కు కల్పించే ఉద్దేశంతో అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద రెండు రోజులపాటు ప్రత్యేక ఓటర్ గుర్తింపు, నమోదు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. గతంలో ఓటు నమోదు చేసుకున్న వారు ఈ ప్రత్యేక శిబిరాల వద్దకు వచ్చి జాబితాలో తమ ఓటు ఉందో లేదో సరిచూసుకోవాలన్నారు. ఫారం-6 ద్వారా కొత్త ఓటర్ నమోదు, ఫారం-6బి ద్వారా ఓటర్ గుర్తింపు కార్డుతో ఆధార్ లింకేజ్, ఫారం-7 ద్వారా మరణించిన వారి పేర్లు తొలగింపు, ఫారం-8 ద్వారా అక్షర దోషాలు, ఫోటో, డోర్ నెంబర్ మార్పు, ఓటు బదిలీ వంటివి చేసుకునే అవకాశం ఉందన్నారు. ఈ నెల 9 వరకు ఓటర్ నమోదు జరుగుతుందన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా శనివారం 506 దరఖాస్తులు వస్తే, ఆదివారం 696 దరఖాస్తులు వచ్చాయన్నారు. మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి మాట్లాడుతూ ఓటు హక్కు ద్వారా దేశ భవిష్యత్తు నిర్ణయించే అవకాశం లభిస్తుందన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కోసం బీఎల్వోలు, సచివాలయం, రెవెన్యూ అధికారులను సంప్రదించాలన్నారు. 18 ఏళ్ల వయసు నిండిన యువతీ యువకులు ప్రత్యేక ఓటర్ నమోదు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో బీఎల్వోలు, ఎన్నికల సిబ్బంది, తదితరులున్నారు.

ఓటర్ నమోదు శిబిరాల ద్వారా 56 దరఖాస్తులు

క్రోసూరు: రాష్ట్ర ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఓటర్ నమోదు శిబిరాల ద్వారా 56 దరఖాస్తులు వచ్చినట్లు డిప్యూటీ తహసీల్దార్ డి.శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. మండలంలోని 57 పోలింగ్ స్టేషన్లలో శని, ఆదివారాలు శిబిరాలు నిర్వహించటం జరిగింది. శిబిరాల ద్వారా కొత్తగా ఓటు నమోదు, మార్పులు, చేర్పులు, సవరణలు, తొలగింపుల దరఖాస్తులు అందుబాటులో ఉంచటం జరిగింది. తహసీల్దార్, బీఎల్వోలు, రెవెన్యూ అధికారులు శిబిరాల వద్ద ఉండి దరఖాస్తులను తీసుకున్నారు. మండలంలోని దొడ్లేరు జెడ్పీపాఠశాల ఆవరణలో ఓటర్ నమోదు శిబిరాన్ని రెవెన్యూ అధికారి సీనియర్ అసిస్టెంట్ పి.నాగేశ్వరరావు పర్యవేక్షించారు. బీఎల్వో సైదులు ఓటర్ శిబిరంలో నమోదు ప్రక్రియ చేపట్టారు.

ఆదివారం నియోజకవర్గ వ్యాప్తంగా వచ్చిన దరఖాస్తులు...

మండలం	ఫారం-6	ఫారం-7	ఫారం-8	మొత్తం
సత్తెనపల్లి టౌన్	93	64	65	222
సత్తెనపల్లి రూరల్	85	39	104	228
ముప్పాళ్ళ	64	15	10	89
రాజుపాలెం	04	25	10	39
నకరికల్లు	36	59	23	118
మొత్తం	282	202	212	696

పోలింగ్ కేంద్రాల పరిశీలన

నకరికల్లు: ఓటర్ల నుంచి వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పొందుపరచాలని ఆర్డీఓ బీఎల్ఎన్ రాజకుమారి సూచించారు. మండలంలోని చీమలమర్రి, చాగల్లు, కండ్లకుంట గ్రామాల్లోని 7పోలింగ్ కేంద్రాలను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటర్ల నుంచి వచ్చే అభ్యంతరాలు రాతపూర్వకంగా స్వీకరించాలని అన్నారు. ఓటర్ల సవరణకు, కొత్త ఓటరు నమోదు దరఖాస్తులను వేర్వేరుగా స్వీకరించాలని సూచించారు. రిజిస్టర్‌లను తనిఖీచేసి పలు సూచనలు చేశారు. తహసీల్దార్ కె.నగేష్ మాట్లాడుతూ ఫారం-6 36, ఫారం-7 59, ఫారం-8 23 దరఖాస్తులు ఆదివారం వచ్చాయన్నారు. శని, ఆదివారాల్లో అన్ని రకాల దరఖాస్తులు కలిపి మొత్తం 170 వచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

9వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరణ

ముప్పాళ్ళ: 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటు హక్కు పొందేందుకు గాను డిసెంబర్ 9వ తేదీలోపు దరఖాస్తు అందించవచ్చని సత్తెనపల్లి ఎన్నికల రిటర్నింగ్ అధికారి బీఎల్ఎన్ రాజకుమారి చెప్పారు. మండలంలోని చాగంటివారిపాలెం, గోళ్ళపాడు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలలో ప్రత్యేక శిబిరాలను ఆదివారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఎన్నికల కమిషన్ డిసెంబర్ 9 వరకు ఓటర్ల నమోదు దరఖాస్తులు, సవరణలు చేపట్టేందుకు అవకాశం కల్పించిందన్నారు. అర్హులు దరఖాస్తు చేసుకొని ఓటు హక్కు పొందవచ్చన్నారు. మాదల, ఇరుకుపాలెం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ ఎం.భవానిశంకర్ తనిఖీ చేశారు. డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసాదు, ఆర్‌ఐలు పవన్‌కుమార్, కపిల్ దేవ్, ఆయా గ్రామాల బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

క్రోసూరు: మండలంలోని దొడ్లేరు గ్రామ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని హసనాబాద్, దొడ్లేరు, ఆవులవారిపాలెం, పెరికపాడు గ్రామాలకు సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు మండల విద్యుత్ ఏఈ ఎం.బసవరాజు ఆదివారం తెలిపారు. జగనన్న కాలనీలలో విద్యుత్ మరమ్మతులు చేస్తున్నందున ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల రైతులు, ప్రజలు సహకరించాలని కోరారు.

గుంటూరు వైద్యశాలలో పింఛన్ పంపిణీ



సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణంలోని 19వ వార్డుకు చెందిన చేనేత కార్మికుడు అనుమల కొండ గురవయ్య అనారోగ్యంతో గుంటూరులోని ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న వలంటీర్ ప్రమీల ఆదివారం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో గురవయ్యకు పెన్షన్ నగదు పంపిణీ చేసింది. ఈ సందర్భంగా కొండ గురవయ్య మాట్లాడుతూ వైద్యశాలలో చికిత్స పొందుతున్నప్పటికీ క్రమం తప్పకుండా పెన్షన్ నగదు అందేలా చేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి, మంత్రి అంబటి రాంబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రమీలను కమిషనర్ కొలిమి షమ్మి, కౌన్సిలర్ అవ్వారు శ్రీనివాసరావు ప్రత్యేకంగా అభినందించారు.

గోశాలలో కార్తీక వన సమారాధన



సత్తెనపల్లి: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా గల గో సంరక్షణ శాలలో ఆర్యవైశ్య చలివేంద్ర సంఘం వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్తీక సమారాధన ఆదివారం సందడిగా సాగింది. ఉదయం 9 గంటలకు సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించారు. ఆర్యవైశ్య దంపతులు పెద్ద ఎత్తున పాల్గొని భక్తి శ్రద్ధలతో వ్రతం నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఆర్యవైశ్య చలివేంద్ర సంఘం అధ్యక్షుడు శింగరి మధుసూధన్‌రావు, గో సంరక్షణశాల అధ్యక్షుడు మాడ నాగరమేష్, ఉపాధ్యక్షుడు అన్నా సుమన్, కార్యదర్శి తొమండ్రు సత్యనారాయణ, సహాయ కార్యదర్శి కొత్తూరి విశ్వేశ్వరరావు, కోశాధికారి కనమర్లపూడి సుబ్బారావు, దేవరశెట్టి రవికుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వైభవంగా శ్రీలక్ష్మీ అమ్మవారి తిరునాళ్ళు



అమరావతి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అమరావతికి సమీపాన ముత్తాయిపాలెం గ్రామంలో వెలసిన నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజాము నుంచి పెద్ద ఎత్తున భక్తులు ముత్తాయిపాలెం చేరుకున్నారు. ఉదయం ఆరు గంటలకు ఆలయంలో పూజలు ప్రారంభించారు. తొలుత విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవాచనం, అంకురార్పణ అనంతరం బలిహరణ కార్యక్రమాలు నిర్వహించారు. గణపతి హోమం, గ్రామదేవతల ఆహ్వానంలో ఊరుబయట ఉన్న గ్రామ దేవతల దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పరాశరం రామకృష్ణమాచార్యులు యాజ్ఞిక పర్యవేక్షణలో భక్తులచే లక్ష్మీనారాయణ, గాయత్రీ, సుదర్శన హోమం నిర్వహించి అమ్మవారికి ఏకనామ కుంకుమార్చన, శాంతిహోమం నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేకంగా పలురకాల పుష్పమాలలతో కన్నుల పండువగా అలంకరించారు. అమ్మవారికి భక్తులు పొంగళ్ళు చేసి మొక్కుబడులు తీర్చుకున్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

దివ్యాంగులకు ట్రైసైకిళ్లు అందజేత

దాచేపల్లి : దివ్యాంగులకు అండగా ఉంటామని ది మదర్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు నాగెండ్ల సుమతీరత్నం అన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం నారాయణపురం ఆర్‌అండ్‌బీ బంగ్లాలో ఆదివారం నిర్వహించారు. టిక్నో పెయింట్స్ అధినేత ఆకూరి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో దివ్యాంగులకు 5 ట్రైసైకిళ్లను పంపిణీ చేసి అన్నదాన కార్యక్రమం చేపట్టారు. దివ్యాంగుల సంఘం ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు. సుమతీరత్నం మాట్లాడుతూ టిక్నో పెయింట్స్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలను చేపట్టామని, భవిష్యత్‌లో అన్ని విధాలుగా దివ్యాంగులకు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో శ్రీనగర్ ఎంపీటీసీ ఆకూరి కాశీరెడ్డి, దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు షేక్ నాగుల్‌మీరా, మార్కెట్‌యార్డు మాజీ డైరెక్టర్ బండ్ల ఏసుపాదం, నాయకులు బండ్ల మరియదాసు, పత్రా ప్రభుదాసు, కటికల మరియబాబు పాల్గొన్నారు.

నేడు ఊటుకూరులో 'వై ఏపీ నీడ్స్ జగన్'

క్రోసూరు: మండలంలోని ఊటుకూరు గ్రామంలో సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరుగుతుందని ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి దర్శి వెంకటేశ్వరరావు ఆదివారం తెలిపారు. పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

ఆటో బోల్తా... ముగ్గురికి తీవ్ర గాయాలు



రెంటచింతల: మండల కేంద్రమైన రెంటచింతలలో ఎంఆర్ఎఫ్ షోరూం వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో బోల్తాపడి ముగ్గురికి తీవ్రగాయాలైన ఘటన జరిగింది. స్థానిక ఆంజనేయస్వామి మాన్యం కాలనీకి చెందిన వ్యవసాయ కూలీలు ఆటోలో పత్తితీత పనులకు వెళ్తుండగా అదుపుతప్పి ఆటో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో మారెబోయిన ఆదిలక్ష్మి, గుమ్మా రమణ, అంజిలకు తీవ్రగాయాలు కాగా మరో ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే 108 వాహనం ద్వారా క్షతగాత్రులను స్థానిక ప్రైవేటు ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అనంతరం తీవ్రంగా గాయపడిన ముగ్గురిని మెరుగైన వైద్యం కోసం గుంటూరులో ఓ ప్రైవేటు ఆస్పత్రికి, స్వల్పంగా గాయపడిన వారిని గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిమితికి మించి వ్యవసాయ కూలీలతో ఆటోలు వెళ్తున్నా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు అన్నారు.

రామ మందిరంలో షెడ్ నిర్మాణానికి శంకుస్థాపన



మంత్రి అంబటి రాంబాబును సత్కరిస్తున్న మేదర సంఘ నాయకులు

సత్తెనపల్లి: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం సమీపంలో గల మేదర సంఘం వారి రామ మందిరంపైన నూతన షెడ్ నిర్మాణానికి రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ఆదివారం శంకుస్థాపన చేశారు. అందరూ కలసికట్టుగా ఆధ్యాత్మిక కార్యక్రమాలకు వినియోగించుకునేలా షెడ్ నిర్మాణం దోహదపడాలన్నారు. ముందుగా వైఎస్సార్ సీపీ బీసీ సెల్ పట్టణ అధ్యక్షుడు తుమ్మల వెంకటేశ్వరరావుతో రామ మందిరం గురించి చర్చించారు. అనంతరం మంత్రి అంబటి రాంబాబు, చల్లంచర్ల సాంబశివరావు, కాకుమాను రవిలను సత్కరించారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు షేక్ మౌలాలి, కోఆప్షన్ మెంబర్ తుమ్మల లక్ష్మి సుజాత, కౌన్సిలర్లు అచ్యుత్ శివప్రసాద్, కుకుట్ల లక్ష్మి, కాకుమాను రవి, ట్రేడ్ యూనియన్ పట్టణ అధ్యక్షుడు వల్లెం నరసింహారావు, మేదర సంఘం నాయకులు తుమ్మల ఏడుకొండలు, జొరిగే కోటేశ్వరరావు, తుమ్మల నాగప్రసాదబాబు, చందా సోమయ్య, జొరిగే శ్రీను, గుండా శ్రీరామమూర్తి, పాల్గొన్నారు.

వైకల్యాన్ని ఆత్మస్థైర్యంతో జయించాలి

- ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులు దేవుని బిడ్డలు
- కొమెరపూడి గ్రామ సర్పంచ్ కొరివి అనిల్‌కుమార్



బహుమతులు అందుకుంటున్న విజేతలు

సత్తెనపల్లి: దివ్యాంగులు దేవుడిచ్చిన అద్భుతాలని వారు ఆత్మస్థైర్యంతో వైకల్యాన్ని జయించేలా మన మందరం ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని కొమెరపూడి సర్పంచ్ కొరివి అనిల్‌కుమార్ అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకొని చిమట లీలావతి ఫౌండేషన్ వారి కమిట్మెంట్ సంస్థ ఆధ్వర్యంలో సత్తెనపల్లి మండలం కొమెరపూడి గ్రామంలో దివ్యాంగులకు నిర్వహించిన వివిధ పోటీల్లోని విజేతలకు బహుమతుల పంపిణీ కార్యక్రమంలో ఆదివారం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆ సంస్థ సత్తెనపల్లి ఏరియా సమన్వయకర్త సీహెచ్ నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ దివ్యాంగులకు అవసరమైన వసతులు ప్రభుత్వం కల్పిస్తుందని, స్వచ్ఛంద సేవా సంస్థల సహాయాన్ని కూడా సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల నాయకులు షేక్ యలవర్తిపాటి ఈసా, స్థానిక ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు

బొల్లాపల్లి: పునీత ఫ్రాన్సిస్ శౌరి వారి మహోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని రెడ్డిపాలెం గ్రామంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఈ పోటీల్లో 15 టీమ్‌లు పాల్గొన్నాయని నిర్వాహకులు తెలిపారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్థ బహుమతులు బాపట్ల, బేతపూడి, పల్నాడు, రెడ్డిపాలెం టీమ్‌లు వరుసగా గెలుపొందాయి. గెలుపొందిన విజేతలకు శ్రీచక్ర సిమెంట్స్, శివశక్తి లీలా ఫౌండేషన్, రెడ్డిపాలెం ఎంప్లాయీస్ యూనియన్ తదితరులు బహుమతులు అందజేశారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ, 4వ బహుమతుల్లో ప్రథమ బహుమతి రూ.20,116, ద్వితీయ 15,116, తృతీయ 10,116, 4వ బహుమతి 7,116లు విజేతలకు అందజేశారు

తాళాలు వేసిఉన్న ఇంట్లో అగ్ని ప్రమాదం

గుంటూరు ఈస్ట్: తాళాలు వేసి ఉన్న ఇంట్లో అగ్ని ప్రమాదం చోటు చేసుకున్న ఘటన రాజ్యలక్ష్మీ నగర్‌లో జరిగింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. స్థానికులు ఫైర్ సర్వీస్‌కు సమాచారం ఇవ్వగా సిబ్బంది తాళాలు పగులగొట్టి మంటలు ఆర్పారు. హైఓల్టేజీ కారణంగా కాలనీలోని పలు గృహాల్లో అనేక విద్యుత్ పరికరాలు కాలిపోయాయి. స్థానికులు ఈ ఘటనపై ఆందోళన వెలిబుచ్చారు. విద్యుత్ శాఖ సిబ్బంది ఘటన స్థలానికి వచ్చి ట్రాన్స్‌ఫార్మర్‌లో మరమ్మతులు చేసి సరఫరా పునరుద్ధరించారు. ఇల్లు ఎవరిదో వివరాలు తెలియలేదు.

ఆసక్తిగా కొనసాగుతున్న ఎడ్ల బండ లాగుడు పోటీలు



ధర్మవరంలో ఎడ్ల బల ప్రదర్శనను నిర్వహిస్తున్న దృశ్యం

దుర్గి: ప్రసిద్ధిగాంచిన హరిహర బాల నాగేంద్రస్వామి తిరునా సందర్భంగా ధర్మవరం గ్రామంలో నిర్వహిస్తున్న తెలుగు రాష్ట్రాల స్థాయి ఎడ్ల బల ప్రదర్శన మూడో రోజు కొనసాగింది. ఆదివారం ప్రత్యేక కేటగిరి విభాగంలో హైదరాబాదుకు చెందిన మేక రామకృష్ణ ఎద్దు నిర్ణీత సమయంలో ఐదు వేల అడుగులు దూరం లాగి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నాయి. గుంటూరు జిల్లా కుంచనపల్లి గ్రామానికి చెందిన పులగం త్రిషస్వారెడ్డి ఎద్లు 4,798.8 అడుగుల దూరాన్ని లాగి రెండో స్థానం, పల్నాడు జిల్లా నాదెండ్ల గ్రామానికి చెందిన దేవభక్తుని శ్రీకాంత్ చౌదరి ఎద్లు 4,758 అడుగులతో మూడవ స్థానం, కృష్ణా జిల్లా కొక్కిలగడ్డ గ్రామానికి చెందిన రాఘవయ్య మెమోరియల్ బాబు 4,385.05 అడుగులతో నాలుగవ స్థానం, గుంటూరు జిల్లా ప్రత్తిపాడు గ్రామానికి చెందిన పమిడి అంజయ్య చౌదరి ఎద్లు 4,300 అడుగులతో ఐదవ స్థానంలో నిలిచాయి. ఈ సందర్భంగా పలు గ్రామాల నుంచి పెద్ద ఎత్తున రైతు సోదరులు, పశు పోషక అభిమానులు తరలివచ్చి పోటీలను ఆసక్తిగా తిలకించారు. పోటీల వ్యాఖ్యాతగా గూడా రామకృష్ణ వ్యవహరించారు. నిర్వాహకులు ఎడ్ల యజమానులకు తగిన ఏర్పాట్లను చేసి పోటీలను విజయవంతంగా నిర్వహిస్తున్నారు.

తుపాను హెచ్చరికల నేపథ్యంలో సస్యరక్షణ



ఏవో వేణుగోపాల్

క్రోసూరు: వాతావరణశాఖ తుపాను హెచ్చరికల నేపథ్యంలో పంటలను రక్షించుకునేందుకు జాగ్రత్తలు, సత్వర చర్యలను తీసుకోవాలని ఏవో వేణుగోపాల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. వరి పంట సస్యరక్షణ గురించి తెలుపుతూ వరి గింజ గట్టిపడి కోతకు సిద్ధంగా వున్న దశలో సత్వరమే కంబైన్డ్ హార్వెస్టర్ ఉపయోగించి, వచ్చిన ధాన్యాన్ని సురక్షిత ప్రాంతంలో ఆరబెట్టుకోవడం, తగినన్ని టార్పాలిన్, పాలిథిన్ పట్టాలను అందుబాటులో పెట్టుకోవాలన్నారు. అదేవిధంగా వరి కోసిన పనలను తక్షణమే కుప్పలు పోసి వర్షానికి తడవకుండా చూసుకోవాలన్నారు. తడిసిన పనలలో మొలకలు రాకుండా 5% ఉప్పు ద్రావణం పిచికారీ చేయవలసి ఉంటుంది.

మెట్ట పంటల రక్షణ..

మెట్ట పంటలు పత్తి, మిరపలో వర్షపు నీరు నిలవకుండా, సులభంగా పోయే విధంగా చేల గట్లలో వాలుకు నిలువుగా గండ్లు చేయాలన్నారు. పత్తిలో పత్తితీతల కాయలు విచ్చుకున్న పత్తిని తీయడం. మిరపలో తయారైన పచ్చి, పండు మిరపను కోసి, వర్షాలకు తడవకుండా, బూజు పట్టకుండా కాపాడుకోవాలన్నారు. వానలు తగ్గిన తర్వాత విల్ట్ తెగులు సోకకుండా పొటాషియం నైట్రేట్ పిచికారీ, యూరియా పొటాష్‌తో కలిపి మొక్కల మొదళ్లలో జల్లాలన్నారు.

త్రైతసిద్ధాంత భగవద్గీత ప్రచారం



నకరికల్లు: కార్తీకమాసం పురస్కరించుకొని త్రైతసిద్ధాంత భగవద్గీత ప్రాముఖ్యతను ప్రజలకు వివరించేందుకు విస్తృత ప్రచారం చేపట్టనున్నట్లు పిడుగురాళ్ల కమిటీ అధ్యక్షుడు కటికం సైదారావు అన్నారు. త్రైతసిద్ధాంతం - ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞానవేదిక పిడుగురాళ్ల కమిటీ ఆధ్వర్యంలో త్రైతసిద్ధాంత భగవద్గీత ప్రచార కార్యక్రమం ఆదివారం నకరికల్లులో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాహ్య విషయాలు వీడి అంతర్ముఖులై చూస్తే ఆత్మదర్శనం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో త్రైతసిద్ధాతం- ప్రబోధసేవాసమితి ఇందూ జ్ఞానవేదిక కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దత్తు మాస్టారి మృతికి సంతాపం



దత్తుమాస్టారు (ఫైల్)

అమరావతి: స్థానిక శ్రీరామకృష్ణ హిందూ హైస్కూల్ విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు, యూటీఎఫ్ రాష్ట్ర సీనియర్ నాయకులు ముదునూరు అక్షయకుమార్ దత్తు(77) ఆదివారం హైదరాబాద్‌లో మరణించారు. ఈ క్రమంలో మండల సీపీఎం పార్టీ కార్యదర్శి బి.సూరిబాబు మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై అనేక ఉద్యమాలు నిర్వహించారన్నారు. యూటీఎఫ్ సంఘ నిర్మాణంలో కీలక పాత్ర పోషించారన్నారు. అమరావతిలో దత్తు మాస్టారు కుటుంబం అనేక మందికి విద్యనందించి వారి భవిష్యత్ తీర్చిదిద్దారన్నారు. ఈ సందర్భంగా దత్తు మాస్టారు మృతికి మండల సీపీఎం పార్టీ, ప్రజా సంఘాలు, ఉపాధ్యాయసంఘాలు, శ్రీరామకృష్ణ హిందూ హైస్కూల్ సిబ్బంది, విద్యార్థులు సంతాపం తెలియజేస్తూ వారి కుటుంబానికి ప్రగాఢమైన సానుభూతి తెలియజేశారు.

స్వచ్ఛత ఉద్యమ సహకారానికి సమష్టిగా కృషి చేద్దాం

- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- రూ.31 లక్షలతో మురుగుశుద్ధి వాహనాల ప్రారంభోత్సవం



వాహనాలను ప్రారంభించి తాళాలు అందిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: స్వచ్ఛత ఉద్యమ సహకారానికి సమష్టిగా కృషి చేద్దామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద పురపాలక సంఘం ఆధ్వర్యంలో స్వచ్ఛత ఉద్యమంలో భాగంగా మున్సిపల్ కార్మికులకు అందిన మురుగుశుద్ధి వాహనాలను ఎస్ఎస్‌కేఎఫ్‌డీసీ వారి సహకారంతో రూ.31 లక్షలతో రెండు వాహనాలను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నామన్నారు. పారిశుధ్య, స్వచ్ఛత నిర్వహణ నిరంతర ప్రక్రియ అన్నారు. మురుగుశుద్ధి వాహనాలను సక్రమంగా వినియోగించి మున్సిపాలిటీలో స్వచ్ఛతకు స్వచ్ఛందంగా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చలంచర్ల సాంబశివరావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు షేక్ మౌలాలి, కమిషనర్ కొలిమి షమ్మి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పార్థసారధి, పల్నాడు జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, నాయకులు కాకుమాను రవి, తుమ్మల వెంకటేశ్వరరావు, కూకుట్ల శ్రీనివాసరావు, వల్లెం నరసింహారావు, పలువురు కౌన్సిలర్లు, నాయకులు, వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల బాధ్యులు, తదితరులున్నారు.

పల్నాటి ఉత్సవాలకు కొనసాగుతున్న పనులు

పల్నాటి రణస్థలికి తరలివచ్చే వీరాచారులకు, భక్తులకు సౌకర్యాల కల్పన



మెట్ల నిర్మాణ పనులు జరుగుతున్న దృశ్యం

కారెంపూడి: ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆదేశాలతో పల్నాటి ఉత్సవాలకు వచ్చే భక్తులకు అవసరమైన సౌకర్యాల కల్పన జరుగుతోంది. నాగులేరు గంగధారి మడుగుకు ఇరువైపులా ఆదివారం మెట్ల నిర్మాణం చేశారు. గ్రామ సర్పంచ్ రమావతు ప్రమీలాభాయి తేజానాయక్ దగ్గరుండి పనులు చేయించారు. గంగధారిలో దిగి పల్నాటి వీరాచారవంతులు ఆయుధాలు శుభ్రం చేసుకోడానికి వీలుగా సర్పంచ్ మెట్లు నిర్మాణ పనులు చేయించారు. గంగధారి మడుగు ఒడ్డునే వీరుల గుడి ఉంది. పల్నాటి వీరాచారవంతులు తమ ఆయుధాలు (దైవాలు)తో తరలివచ్చి ముందుగా నాగులేరు గంగధారిలో స్నానాలాచరించి ఆయుధాలను శుభ్రం చేసుకుంటారు. అదే విధంగా ఐదు రోజుల పాటు జరిగే ఉత్సవాలలో ప్రతి రోజూ గంగధారిలో వీరాచారవంతులు స్నానాలాచరించడం చేస్తారు. ఇదిలా ఉంటే పల్నాటి వీర్ల అంకాలమ్మతల్లి గుడి సమీపంలో ఉన్న బాలచంద్రుని పొట్టేలు దూకిన పాద ముద్రలను ప్రజలు వీక్షించే విధంగా ఏర్పాటు చేశారు. అక్కడకు సమీపంలోని కోట బురుజుకు, తోట బజారులో ఉన్న బ్రహ్మనాయుడు మేడ (కత్తుల బావి మేడ), కన్నమదాసు మండపానికి రంగులు వేయిస్తున్నారు. ఇప్పటికే రణక్షేత్రంలో బ్రహ్మనాయుడు విగ్రహం ఉంది. కన్నమదాసు మండప ప్రాంగణంలో కన్నమదాసు విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఉత్సవ ప్రాంగణంలో ప్రజలకు వినోదాన్ని అందించే వివిధ రకాల ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నారు. పల్నాటి ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా గ్రామ పంచాయతీ, మండల ప్రజా పరిషత్ పాలక వర్గాలు ఏర్పాట్లు చేస్తున్నాయి. దేవదాయ శాఖ కూడా చెన్నకేశవస్వామి, వీర్ల అంకాలమ్మతల్లి దేవాలయాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతోంది. ఉత్సవాల మూడవ రోజు మందపోరు నాడు జరిగే బ్రహ్మనాయుడు చాపకూడు సహపంక్తి భోజనాలకు జిల్లా ప్రజా పరిషత్ కొన్నేళ్లుగా పీఆర్కే చొరవతో చేయూతనందిస్తోంది.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

రెంటచింతల: బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం ప్రస్తుతం మరింత బలపడి తుపాన్‌గా మారిన నేపథ్యంలో మండల రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ అధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 4, 5 తేదీలలో కనీసం 40 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందన్నారు. రైతులు వరి పంట కోతలను వాయిదా వేసుకోవాలని సూచించారు. ఒక వేళ కోతలు కోసిన రైతులు వెంటనే కుప్పలు పెట్టుకోవాలన్నారు. పంట నూర్పి కల్లాల్లో ఉంటే ధాన్యాన్ని సురక్షిత ప్రదేశానికి చేర్చుకోవాలని కోరారు.